క్లుప్తంగా

ఘనంగా చండీయాగం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ మహంకాళి దేవాలయంలో మంగళవారం చండీయాగం ఘనంగా నిర్వహించారు. చండీయాగం శ్రీదేవి ఉపాసకులు బ్రహ్మశ్రీ ముస్త్యాల సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు అవధూత శర్మ, వంశీ శర్మ, సురేష్ శర్మ సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులు అడ్డగింత



అడ్డుకుంటున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ నుంచి తానిమడుగు వరకు రూ.49.65లక్షల నిధులతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులను తానిమడుగు గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. బీటీ పలుచగా వేస్తున్నారని, నాణ్యతగా చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్, పీఆర్‌ఏఈ తివారి అక్కడకు చేరుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డుపై తారు కోట్ వేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

చెన్నూర్‌లో పలు ప్రారంభోత్సవాలు

చెన్నూర్: పట్టణంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బుధవారం మధ్యాహ్నం 1గంటలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలలో భాగంగా మహాలక్ష్మీ ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ పథకాలను ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గ్రామీణ డాక్ సేవకుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న గ్రామీణ డాక్ సేవకులు

మందమర్రిరూరల్: గ్రామీణ డాక్ సేవకుల (జీడీఎస్)ను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, రోజుకు ఎనిమిది గంటల పనికి వేతనం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె బాట పట్టారు. పట్టణంలోని కళ్యాణిఖని సబ్ పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట మంగళవారం శిబిరం ఏర్పాటు చేసి దీక్షలో పాల్గొన్నారు. శంకర్‌లింగం, భూమన్న, సురేష్, జాదవ్ ఆమోల్, శంకరయ్య అమీద్, జాఫరుల్లాఖాన్ సబ్ పోస్టాఫీస్ పరిధిలోని గ్రామీణ డాక్ సేవకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ విశ్వంబర్

భీమారం: మండలంలోని పోలంపల్లిలో డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ విశ్వంబర్ తనిఖీ చేశారు. ఈ మేరకు కేంద్రానికి వచ్చిన వరికుప్పలను పరిశీలించారు. అనంతరం తేమశాతం లెక్కించే మిషన్‌ను తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన వడ్లు ఆరిన వెంటనే తేమశాతం పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ రంజిత్ ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శిగా రాఘవరెడ్డి



రాఘవరెడ్డి

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా శ్రీరాంపూర్‌కు చెందిన మోతె రాఘవరెడ్డిని నియమిస్తూ ఆయూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి కేంద్ర కమిటీ బాధ్యతలు అప్పగించినందుకు రాఘవరెడ్డి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

- సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురి వేడుకోలు
- పీఎస్సార్‌ను సత్కరించిన ఉద్యోగ సంఘాల నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

మంచిర్యాలఅర్బన్: పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోట్టె శంకర్, గౌరవ అధ్యక్షురాలు శాంకరి, సంపాదక వర్గ సభ్యులు రాసపల్లి రవి, రాష్ట్ర శాఖ బాధ్యులు విక్రమ్‌కుమార్, ప్రసాద్, కర్నాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు అనుమతివ్వాలని వినతి

పాతమంచిర్యాల: మహాత్మజ్యోతిభాపూలే విగ్రహ ప్రతిష్టాపన కోసం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సర్కిల్‌లో స్థలం, అనుమతి ఇప్పించాలని కోరుతూ తెలంగాణ బీసీ జాగృతి నాయకులు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సానుకూలంగా స్పందించారని తెలంగాణ బీసీ జాగృతి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, విజయ్‌కుమార్ బద్ది శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

దండేపల్లి: ఎమ్మెల్యేను దండేపల్లి మండల విశ్రాంత ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలివ్వాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలకు చెందిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావును ఆయన నివాసంలో కలిసి వేతనాలను చెల్లించాలని వినతిపత్రం అందించారు. పీఎస్సార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రతి నెలా మొదటి వారంలోగా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ, సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సత్తయ్య, సుధాకర్, కుమార్, రాయలింగు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పీఎస్సార్‌ను కలిసిన సింగరేణి జీఎం

ఎమ్మెల్యేను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు.

తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సమీక్షకు విచ్చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు వినతిపత్రం అందించారు. పరి ష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిపారు. అసోసియేషన్ నూతన సభ్యులుగా ఎన్నికైన వారిలో ఉపాధ్యక్షులు మధుసూదన్, మనోజ్, శంకర్, అర్వ నాగరాజు, ఎండి మజార్, మహేశ్వరి, జి. శంకర్, ఇర్ఫాన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం గతంలో వీఆర్వోలుగా పనిచేసిన సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి గత ప్రభుత్వంలో తాము అన్యాయానికి గురయ్యామని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరగా, వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని భరోసాను ఎమ్మెల్యే కల్పించినట్లు వారు తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు.

నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపు నిర్వహణ



ముత్యంపేటలో అనధికారికంగా ఏర్పాటైన బెల్ట్‌షాపు



ఫ్రిడ్జ్‌లో మందు బాటిళ్లు

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖా గెజిట్ నంబర్ 26 మేరకు జాతీయ రహదారికి 500మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. హాజీపూర్ శివారులోని లక్సెట్టిపేట మండలం ముత్యంపేటలో ఎక్సైజ్ శాఖా గెజిట్ నంబర్ 34 దుకాణం కూడా నిబంధనల మేరకు మిట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి 500మీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. ఇందులో అంతా బాగానే ఉంది అనుకుంటున్నారా.. ఇక్కడ తిరకాసు ఉంది. అదేంటంటే.. ముత్యంపేటకు చెందిన మద్యం దుకాణం జాతీయ రహదారికి కనబడేలా.. మిట్టపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేయడంతో ఇది గిట్టని హాజీపూర్ మద్యం దుకాణ యజమానులు కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా హాజీపూర్ శివారు ప్రాంతంలో ముత్యంపేట బస్టాండ్ వద్ద జాతీయ రహదారికి పక్కనే బెల్ట్ దుకాణాన్ని అధికారిక స్థాయిలో ఏర్పాటు చేశారు. ఈ బెల్ట్ షాపులో మద్యం బాటిళ్లు పెట్టుకునేలా ర్యాక్, రిఫ్రిజిరేటర్ ఏర్పాటు చేయడంతో పాటు సిట్టింగ్ పాయింట్ కూడా పెట్టేశారు. లోపలికి వెళ్లి మద్యం కొనుగోలు చేయకుండానే జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బెల్ట్ దుకాణంలో అన్ని రకాల మద్యం బాటిళ్లు, చల్లని బీర్లు లభిస్తున్నాయి. ఈ బెల్ట్ దుకాణం ఏకంగా గెజిట్ లో సూచించిన విధంగా అన్న రీతిలో ఏర్పాటు చేశారు. అయితే మూడు రోజులుగా ఈ బెల్ట్ దుకాణాన్ని దర్జాగా నిర్వహిస్తుండగా వీరికి ఎక్సైజ్ అధికారి అండదండలు మెండుగా ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం దుకాణం జాతీయ రహదారికి దూరంగా పెడుతుంటే, ఈ బెల్ట్ దుకాణం జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేయడమేంటని.? దీని మతలబు ఏంటని.? ఆ.. అధికారుల మద్దతులేనిదే ఈ దుకాణం నడుస్తుందా అని గుసగుసలాడుకుంటున్నారు.

'దళితబంధు' పేరిట వసూళ్లు

- ఎన్నికల ముందే కొందరి నిర్వాహకం
- నిలదీసిన బాధితులు

జన్నారం: మళ్లీ అధికారంలోకి వస్తామని, దళితబంధు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారంలోకి రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన ఇద్దరు యువకులు నిలదీయడంతో బయటకు పొక్కింది. మండల కేంద్రంలో కొందరు నాయకులు దళితబంధు, బీడీల పింఛన్ ఇప్పిస్తామని ఆశ చూపి డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. జన్నారం మండలం పొనకల్‌కు చెందిన కొందరు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్నికలకు మూడు నెలల ముందు నుంచే దళితబంధు ఇప్పిస్తామని కొందరు యువకులకు ఎర వేశారు. దళితబంధు వస్తే తమ బతుకులు బాగు పడుతాయనే ఆశతో ఇద్దరు యువకులు సదరు నాయకులకు కొంత ముట్టజెప్పారు. తీరా ఆ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో సదరు నాయకులను యువకులు నిలదీసినట్లు తెలిసింది. 'ఇందులో మరో ముగ్గురు ఉన్నారని, వారితో మాట్లాడి, మీ డబ్బులు వచ్చేలా చూస్తా' అని ఆ వ్యక్తి హామీనిచ్చినట్లు బాధితులు తెలిపారు. ఇద్దరు కలిసి రూ.3లక్షలు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. కాగా, పొనకల్, కవ్వాల్ గ్రామాల్లో బీడీ కార్మికుల పింఛన్ ఇప్పిస్తామని రూ.5వేల చొప్పున కొందరు మహిళల నుంచి వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో సదరు వ్యక్తులను నిలదీయడానికి సిద్ధమవుతున్నారు.

విద్యాసామగ్రి అందజేత

నెన్నెల: మరణించిన రాంటెంకి రోజారాణి జ్ఞాపకార్థంగా ఆమె సోదరులు పూర్వ విద్యార్థులు రాంటెంకి బిక్షపతి, లక్షపతిలు నార్వాయిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు.

ఆటోడ్రైవర్లు, యజమానుల ఆందోళన



జన్నారం: ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు



సోమగూడెంలో విజ్ఞప్తి చేస్తున్న ఆటోడ్రైవర్లు

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో మంగళవారం ఆటో, టాటా ఏసీ, జీపు ఓనర్లు, డ్రైవర్లు ఆందోళన చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆటోలు, జీపులు, టాటా ఏసీలను రావు మైదానంలో ఉంచి అక్కడే బైఠాయించారు. మహాలక్ష్మీ పథకాన్ని రద్దు చేయాలని నినదించారు. కార్యక్రమంలో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు బాబ, రమేశ్, ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నసీరోద్దీన్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, కోశాధికారి మొగిలి, ఉపాధ్యక్షుడు శంకర్, కవ్వాల్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

కాసిపేట: మండలంలోని సోమగూడెంలో ఆటోడ్రైవర్లు మంగళవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమకు కిరాయిలు లేక జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందని, ప్రభుత్వం పునరాలోచించి ఆదుకోవాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజమల్లు, శంకర్, బాపు ఉన్నారు.

ప్రతీ నెలలో ఒక్కరోజు అన్నదానం



వాసవీక్లబ్ సభ్యుల అన్నదానం



ఆనంద యోగ సాధన వెల్ఫేర్ ఆధ్వర్యంలో...

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్‌లో కల్వరి వృద్ధుల అనాథ ఆశ్రమంలో ప్రతి నెలలో ఒక్కరోజు ఆనంద యోగ సాధన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహారుషి ఆచార్య స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ ప్రతిమ రమేష్‌ల సహకారంతో మంగళవారం అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రతి నెలలో ఒక్కరోజు అన్నదానం చేయడానికి ఆనంద యోగ సాధన వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

కార్తీక మాసం అన్నదానం పూర్తి

మంచిర్యాలటౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కార్తీక మాసం నెల రోజుల అన్నదాన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. నిరుపేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో వాసవీక్లబ్ మంచిర్యాల నెల రోజుల నుంచి నిరంతరంగా చేపడుతున్న అన్నదానాన్ని ప్రసాద వితరణతో పూర్తి చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నలుమాసు ప్రవీణ్, కార్యదర్శి యొర్రం వెంకటేశ్, కోశాధికారి చిలువేరు మహేశ్, జోన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం చైర్మన్ పుల్లూరి బాల మోహన్, వుత్తూరి రమేశ్, తోట రాజయ్య, చందూరి ప్రభాకర్, చిటుమల్ల శ్రీనివాస్, కాసం కృష్ణ, చకినారపు రమేశ్, కిరణ్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరీక్షలపై విచారణ



వివరాలు అడుగుతున్న ఎంపీపీ

జన్నారం: ప్రతీ మంగళవారం మహిళలకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలపై ఎంపీపీ సరోజన విచారణ చేశారు. ఆసుపత్రిని సందర్శించి పలువురు మహిళలను పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇబ్బంది కలుగకుండా ఎప్పటిలాగా పరీక్షలు జరపాలని వైద్యులకు సూచించారు. ఆమె వెంట వైద్యురాలు ఉమాశ్రీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఘనంగా 'సేవా' ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సేవా అధ్యక్షురాలు రాధాకుమారి

శ్రీరాంపూర్: సింగరేణి ఎంప్లాయీస్ వైఫ్స్ అసోసియేషన్(సేవా) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం ఈ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. డిసెంబర్ 10, 2000న సేవా అసోయేషన్ ఏర్పాటయ్యిందన్నారు. సేవా కార్యక్రమాల వల్ల నేడు అనేక మంది యువతీ యువకులు శిక్షణ కోర్సులు నేర్చుకొని స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్ఓటు జీఎం రఘు కుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టే జ్యోతి, సభ్యులు శారద, తిరుమల, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే నూతన బొగ్గు గనులు'



మాట్లాడుతున్న రాజమౌళి

మందమర్రిరూరల్: సింగరేణిలో ఐఎన్‌టీయూసీని గుర్తింపు కార్మిక సంఘంగా గెలిపిస్తే నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి స్పష్టం చేశారు. ఏరియాలోని కేకే-5 గనిపై నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 10బొగ్గు గనుల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వ సహకారంతో అనుమతులు తీసుకొస్తామన్నారు. ఇంత వరకు గుర్తింపు కార్మిక సంఘంగా పనిచేసిన టీబీజీకేఎస్ ప్రభుత్వానికి వత్తాసు పాడుతూ సంస్థను అప్పనంగా దోచుకుందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు దొరలపాలనను అంతంచేసి ప్రజా పాలనను ఎనుకున్నారని, ఈ నెల 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించి సింగరేణిని, కార్మికుల హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు రాంశెట్టి నరేందర్, సదయ్య, సూర్యనారాయణ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

'టీబీజీకేఎస్ ఉద్యోగ అవకాశాలు కల్పించింది'



కాసిపేట 2గనిపై మాట్లాడుతున్న సంపత్

కాసిపేట: సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా నూతన ఉద్యోగాలు కల్పించింది టీబీజీకేఎస్ మాత్రమేనని, నియామకాలు తొలగించిన జాతీయ సంఘాలకు ఓటు అడిగే హక్కు లేదని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేటుమీటింగ్‌లో మాట్లాడుతూ.. కోలిండియాలో లేని హక్కులు సింగరేణిలో ఉన్నాయని, కార్మికులు టీబీజీకేఎస్‌ను గుర్తింపుసంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. సమావేశంలో రీజనల్ సెక్రెటరీ రాజశేఖర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్‌కుమార్, కాసిపేట 2గని ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరి సారంగపాణి, ఏరియా కార్యదర్శి వోడ్నాల రాజన్న, నాయకులు సెగ్గెం శ్రీనివాస్, గోపాలకృష్ణ, శివ, కృష్ణ తదితరులున్నారు.

మేనిఫెస్టో ఆవిష్కరణ

మందమర్రిరూరల్: ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు సంబంధించి ఏఐటీయూసీ మేనిఫెస్టోను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఏరియాలోని వర్క్‌షాప్, స్టోర్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ నాయకులతో కలిసి విడుదల చేశారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు సుదర్శన్, శర్మ, బానయ్య, హేమంత్ తదితరులు ఉన్నారు.





క్రీడా పోటీలు

శ్రీరాంపూర్: సింగరేణ డే ను పురస్కరించుకొని నస్పూర్ కాలనీ సేవా భవన్ వద్ద మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్‌వార్, బాంబ్ బ్లాస్ట్ తదితర క్రీడా పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు





జన్నారం: మనఊరి–మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధిలోకి రాగా, కవ్వాల్ ప్రాథమిక పాఠశాలలో మాత్రం ఉన్న పాఠశాల ఎదుట పైపులైన్ కోసం గుంత తవ్వి వదిలేసి, విద్యార్థులను ఇబ్బందులలోకి నెట్టారు. మండలంలోని కవ్వాల్ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు వైపు ప్రహరీ నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం కాంట్రాక్టర్ గుంత తవ్వారు. పాత ప్రహరీ కూల్చడంతో సిమెంట్, ఇటుక పెళ్లలు అక్కడే పడి ఉన్నాయి. ప్రస్తుతం పాఠశాలకు ఆరు నెలల నుంచి ప్రహరీ లేకపోవడమే కాకుండా, పైపులైన్ కోసం గుంత తవ్వి వదిలేశారు. ఈ గుంత ప్రమాదకరంగా ఉందని, గోడ నిర్మించాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కృపాకర్, శేఖర్ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సర్పంచ్‌కు చెప్పినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు దృష్టి సారించి ప్రమాదకరంగా ఉన్న పైపులైన్ గుంత, పూడ్చి, ప్రహరీ నిర్మించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899